# భరతవీర శతకం



బయ్యారపు చినమల్లేశ్వరరావు

# భరతవీర శతకం

ఆ॥వె॥ మట్టి తత్వమందు గుట్టుకు గుర్తుగా
పార్వతి తనయునికె ప్రథమపూజ
విఘ్నములను దాటి విజయమ్ము పొందగా
ధరణి పరమ పురుష భరతవీర।

ఆ॥వె॥ పనులు చేయుముందు పరమేశుపుత్రుండు
విఘ్నరాజుతోడ విన్నవించి
చేయదగిన పనులు చేయుట మంచిది
ధరణి పరమపురుష భరత వీర।

ఆ.వె. మాతృభూమి కన్న మహిని గొప్పది లేదు
మాతృమూర్తి కన్న మమత లేదు
జనని, జన్మభూమి జగతిలో స్వర్గాలు!
ధరణి పరమ పురుష భరతవీర!

ఆ॥వె॥ బ్రతుకు పంట నిచ్చి భాగ్యాలు కూర్చిన
కన్నవారి విలువ కట్టలేము
వారి సేవలోన తీరుగా వర్థిల్లు
ధరణి పరమ పురుష భరతవీర।

ఆ.వె. మనసు శాంతి కొరకు మంచిగా ప్రార్థించు
సర్వజనుల హితము సతము కోరు
విశ్వశాంతి కన్న విజయమ్ము మహిలేదు
ధరణి పరమ పురుష భరతవీర!

ఆ॥వె॥ 'పని' యనంగ నేమి? ప్రత్యక్ష దైవమ్ము!
శ్రేష్ఠ మార్గమందు చేయవలెను
ఆత్మశుద్ధియున్న నంతయు సిద్ధియే!
ధరణి పరమ పురుష భరతవీర!

ఆ.వె. లౌకికమనిజెప్పి లౌక్యంగ మాట్లాడి
కులము మతము పేర జులుముచేయు
రాజకీయమెపుడు రక్షణ కాబోదు
ధరణి, పరమపురుష భరతవీర!

ఆ.వె. తూలనాడకుండ వీలుగా మాట్లాడు
'గారు' అనుచునొకడు గౌరవించ
ఇచ్చిపుచ్చుకొనుట ఇంగిత జ్ఞానమ్ము!
ధరణి పరమ పురుష భరతవీర!

ఆ.వె. వేదనెంత యేని మోదాన భరియించ
వేదనేమి చేయు వెళ్లిపోక
పార్థు రణము జూచి పరమేశుడేమాయె?!
ధరణి పరమ పురుష భరతవీర!

ఆ.వె. కొండెములను జెప్పి కూరిమి చెడగొట్టు
మనుజు గుట్టు బయట పడకపోదు
దొంగ యెప్పుడైన దొరకక మానునా?
ధరణి పరమ పురుష భరతవీర!

ఆ.వె. ధనము లేకయున్న ధాన్యాలు లేకున్న
బలము లేక కూడ బ్రతకవచ్చు
గౌరవమ్ము లేక గమనమ్ము కష్టమ్ము
ధరణి పరమ పురుష భరతవీర!

ఆ.వె. ఇలను మానవులకు ఇడుములు లేకున్న
ఈశ్వరునె మరచెద రెప్పుడున్ను
ఇడుమలనిన నిలను ఈశ్వరుని పరీక్ష
ధరణి పరమ పురుష భరతవీర!

ఆ॥వె॥ రామనామ స్మరణ రక్షణ వివరణ
మాట కట్టుబాటు, మంచితనము
ధర్మబద్ధమైన దారిలో పాలన
ధరణి పరమ పురుష భరతవీర!

ఆ॥వె॥ అన్నదమ్ములన్న ఆత్మీయ బంధము
పాలనమ్ము నందు ప్రజల సుఖము
మేలు కోరు రాజు మేదిని నిలుచును
ధరణి పరమ పురుష భరతవీర!

ఆ॥వె॥ చిన్నదైన గాని సేవను మరువకు
ఉన్నతగతి చేర ఊతమదియె
సన్నుతి విధమందు చక్కగా సాగుము
ధరణి పరమ పురుష భరతవీర!

ఆ॥వె॥ విద్య విద్య యేను, విత్తమ్ము విత్తమే
దేని గొప్పతనము దానికుండు
విద్య, విత్తములను వేరుగా కొలువుము
ధరణి పరమ పురుష భరతవీర!

ఆ॥వె॥ రామరాజ్యమనగ గ్రామ స్వరాజ్యమ్ము
ప్రజల కందుబాటు పాలనమ్ము
తరతరాల నుండి తారక మంత్రమ్ము
ధరణి పరమ పురుష భరతవీర!

ఆ॥వె॥ శాంతి భద్రతనగ సాంఘిక భద్రత
గొడవగోల లెపుడు గొప్పబాధ
కోరితెచ్చుకోకు కుల మతాల గొడవ
ధరణి పరమ పురుష భరతవీర!

ఆ.వె. పెద్దవారి మాట ముద్దుగా పాటింత్రు
చిన్నవారలన్న చిన్న చూపు
స్థాయి ననుసరించి ధరలోని పరపతి
ధరణి పరమ పురుష భరతవీర!

ఆ.వె. మెదడు లేకయున్న మేధావి మాదిరి
మసల గలరు కొంత మంది జనులు
మేడిపండు పైకి మిలమిలలాడదే!
ధరణి పరమ పురుష భరతవీర!

ఆ.వె. తప్పు నెత్తి జూప ఒప్పుకొనకపోగ
కీడుసేయు పదవి వాడిచేత
ఉన్న మాటలాడ ఉలుకు పెరుగు గాదె!
ధరణి పరమ పురుష భరతవీర!

ఆ.వె. ప్రక్కవారి లెక్క చక్కగా వల్లించి
తమదు లెక్క తాము తలచుకొనరు
ఎదుటివారి కొరకె ఈ నీతులన్నట్లు!
ధరణి పరమ పురుష భరతవీర!

ఆ.వె. పనులు ఉన్నవేళ పలుమార్లు తిరుగుచు
పనులు అయిన వెనుక పలుకనట్టి
సమయ వాదు లిలను చాల మంది గలరు!
ధరణి పరమ పురుష భరతవీర!

ఆ.వె. ఆపదలను మిగుల ఆపద రావచ్చు
సుఖము కలుగవచ్చు సుఖములందు
దేని సమయమందు దాని ప్రాబల్యమ్ము
ధరణి పరమ పురుష భరతవీర!

ఆ॥వె॥ ఉత్తరేణి యిచ్చు ఉత్తమలాభాలు
పళ్లగట్టిదనము పదిలపరచి
దంత ధావనమున తప్పకవాడిన
ధరణి పరమ పురుష భరతవీర!

ఆ॥వె॥ ఉప్పు కారమందు ఉపకారము కలదు
పరిధి, పాళ్ళలోన వాడుకొనగ
ఇలను దేనికైన ఈ సూత్రమేసుమీ!
ధరణి పరమ పురుష భరతవీర!

ఆ॥వె॥ చల్ల, నిమ్మరసము సరియగు పాళ్లలో
కలిపి త్రాగిరేని కలదుమేలు
మండుటెండలందు మంచి ఆరోగ్యంబు
ధరణి పరమ పురుష భరతవీర!

ఆ॥వె॥ మట్టి కుండ నీరు మంచి ఆరోగ్యమ్ము
సహజరీతి మేను చల్లబరచు
భారతీయ ఫ్రిడ్జు పాతకాలమునుండి
ధరణి పరమ పురుష భరతవీర!

ఆ॥వె॥ స్వచ్ఛమైన గాలి స్వచ్ఛభారతిలోన
సాధనమ్ము చేసి సాగవలెను
హృదయశుద్ధి ఉన్న హృద్యమౌ జీవిక
ధరణి పరమ పురుష భరతవీర!

ఆ॥వె॥ గాలి కలుషితమ్ము గేలిగా మారెను
వాహనాల రేసు వరుసపెరుగ
అధిక వాడకమ్ము అదుపు చేయవలెను
ధరణి పరమ పురుష భరతవీర!

ఆ॥వె॥ కులవివక్ష నేడు బలపరీక్షగ మారి
కుటిల రాజకీయ గుదిని చేరె
దీని రూపుమాపి దేశమున్ రక్షించు
ధరణి పరమ పురుష భరతవీర!

ఆ॥వె॥ శతకశాస్త్ర నీతి బతుకున పాటించి
సాగవలెను జనులు సంతసమున
అన్నియు ఒకటన్న అద్వైత భావాన
ధరణి పరమ పురుష భరతవీర!

ఆ॥వె॥ పెరుగు చిలకవచ్చు, వెన్నయు మజ్జిగ
వాటి గుణము తోడ దీటుపొందు
ఉనికి మారగానె ఉపయోగములు మారు!
ధరణి పరమ పురుష భరతవీర!

ఆ॥వె॥ పనికిరానివన్ని పడవేసి మంటలో
వాటి వెలుగు భోగి దీటుపొంది
సంకురాత్రి శోభ సరిగమలందుకో
ధరణి పరమ పురుష భరతవీర!

ఆ॥వె॥ అరసవల్లి నుండి ఆ సూర్యకిరణాలు
అఖిల లోకములను ఆవరించి
క్రొత్త శక్తి నింపె కొండంత అండగా
ధరణి పరమ పురుష భరతవీర!

ఆ॥వె॥ తగిన శిక్ష యున్న ధర్మమ్ము నిలుచును
శిక్షయన్న ఎపుడు కక్ష కాదు
సంఘ రక్ష కొరకు సంస్కార మార్గమ్ము
ధరణి పరమ పురుష భరతవీర!

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Bharata+Veera+Satakam**

* * *